క్లుప్తంగా

సమ్మేళనానికి తరలిన గొల్లకురుమలు



ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తున్న నాయకులు

కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి గొర్ల కాపరుల ఆత్మీయ సమ్మేళనానికి, మంగళవారం కడ్తాల్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో గొల్లకురుమలు తరలివెళ్లారు. మండల కేంద్రంలో గొల్లకుర్మల ఐక్యత వర్ధిల్లాలని ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వారు నివాళులర్పించారు. తరలినవారిలో సంఘం నాయకులు రామకృష్ణ, కృష్ణయ్య, యాదయ్య, నాగార్జున, రాజు, రాములు, వెంకటేశ్, శ్రీను, యాదయ్య, మల్లేశ్, శ్రీను, లింగం, శ్రీశైలం, కృష్ణయ్య, మల్లేశ్ ఉన్నారు.

మహాసభకు తరలిరండి

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్



ప్రచారం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మాదిగల విశ్వరూప మహాసభకు లక్షలాదిగా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్‌పూలే కోరారు. 'హలో మాదిగ–చలో హైదరాబాద్' పేరిట ఈనెల 11న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో మాదిగల విశ్వరూప సభను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మంగళవారం మండలంలోని చుక్కాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహ, మల్లేశ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లింగాయత్ కుంట చెరువులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శాంతమ్మ(48) దివ్యాంగురాలు. ఆమె సోమవారం రాత్రి నుంచి కనిపించడం లేదు. గ్రామస్తుల సమాచారంతో శివారులో గాలించగా లింగాయత్ కుంట చెరువులో శాంతమ్మ మృతదేహం లభ్యమయ్యింది. పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతురాలి సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం ఆదిబట్ల ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆదిబట్ల సమీపంలో వాహనాలు చెక్ చేస్తుండగా ఒక వాహనంలో రేషన్ బియ్యాన్ని గుర్తించిన పోలీసులు 9 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి వాహన డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

ఎల్మినేడులో ధాన్యం కొనుగోలు కేంద్రం

ఇబ్రహీంపట్నం రూరల్: దళారులకు ధాన్యం అమ్మి మోసపోవొద్దని ఎంపీ పటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎలిమినేడులో డీఎస్ఓ రాథోడ్, డీఎం విజయలక్ష్మితో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వ్యవసాయ శాఖ అధికారి రఘు, పాలకవర్గం సభ్యులు యాదయ్య, బాల్‌రెడ్డి, యాదమ్మ పాల్గొన్నారు.

కూతురిపై అఘాయిత్యం

ఇబ్రహీంపట్నం రూరల్: కూతురిని కంటిపాపలా కాపాడాల్సిన తండ్రే కాలయముడయ్యాడు. సొంత కూతురిపై అఘాయిత్యానికి పాల్పడి సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించాడు. ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన అవినాష్.. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కొద్ది సంవత్సరాలుగా ఆదిబట్లలో అద్దెకు ఉంటు కూలీపని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంట్లో తల్లిలేని సమయంలో తన కూతురి(14)పై అవినాష్ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ విషయాన్ని బాలిక.. తన తల్లికి చెప్పడంతో ఆమె ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి దండెం

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించండి.. సేవ చేస్తానని కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి దండెం రాంరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యాచారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశానని అన్నారు. స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తనకు ఒక అవకాశం ఇస్తే వాటన్నింటిని పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆయన మద్దతుదారులు శేఖర్ యాదవ్, సోమయ్య, శ్రీకాంత్, అంజయ్య, దశరథ, శివ, బుగ్గరాములు, శ్రీశైలం పాల్గొన్నారు.

ఇక అంతా ఆన్‌లైన్



యాచారం పీఏసీఎస్ కార్యాలయం

- పీఏసీఎస్ రుణాలు పొందిన రైతుల భూవివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- భూ వివరాలు, బ్యాంకు ఖాతా నంబర్లకు ఆధార్ అనుసంధానం
- క్రయ, విక్రయాలు జరపకుండా జాగ్రత్తలు
- బకాయిలు చెల్లించకుంటే భూముల వేలం!

యాచారం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో రుణాలు పొందిన రైతుల భూరికార్డుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇన్నాళ్లు పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతుల భూ రికార్డులను మ్యాన్‌వల్‌గా రికార్డుల్లో నమోదు చేసి రుణాలు ఇచ్చేవారు. బీఆర్ఎస్ సర్కార్ ధరణి పోర్టల్ తెచ్చి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు ఇచ్చింది. అంతకుముందే రైతులు పాత పట్టాదారు, పాసుపుస్తకాలు పీఏసీఎస్‌లో పెట్టి దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పొందారు. యాచారం పీఏసీఎస్‌లో 7,900 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. అందులో 2,032 మంది రైతులు దీర్ఘకాలిక రుణాలు పొందగా.. 1,100 మంది రైతులు స్వల్పకాలిక రుణాలు పొందారు. మొత్తం 3,132 మంది రైతులు పీఏసీఎస్‌లో రూ.50 కోట్లకు పైగానే రుణాలు పొందారు. దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు పౌల్ట్రీ ఫాం, డెయిరీఫాం, మేకలు, గొర్రెల పెంపకం చేపట్టారు. ఈ రైతులు ప్రతి ఆరునెలల కోమారు కొంత అసలుతో పాటు వడ్డీతో సహా వాయిదాలు చెల్లించేలా నిబంధన ఉంది. ధరణి పోర్టల్ తర్వాత కొత్త పుస్తకాలు నేరుగా తపాలా శాఖ ద్వారా రైతుల ఇళ్ల వద్దకే వచ్చాయి. కొత్త పాసుపుస్తకాలు వచ్చిన తర్వాత రైతులు పీఏసీఎస్‌లో రుణ బకాయిలున్నప్పటికీ భూముల క్రయ, విక్రయాలు చేపట్టారు.

ఆన్‌లైన్‌లో రికార్డుల నమోదు..

రైతుల మోసాన్ని పసిగట్టిన పీఏసీఎస్ అధికారులు రుణాలు పొందిన రైతుల భూ రికార్డుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రుణాలు పొందిన సమయంలో రైతులు తనకున్న ఏఏ సర్వే నంబర్లల్లో ఎన్ని ఎకరాలు తాకట్టు పెట్టారు. ఎంత రుణం పొందారు, బ్యాంకు ఖాతానంబర్లు, ఆధార్ నంబర్లతో అనుసంధానం చేస్తున్నారు. డీసీసీబీ బ్యాంకు ఆదేశాల మేరకు వారం రోజులుగా యాచారం పీఏసీఎస్ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బంది ద్వారా రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. మొత్తం 3,132 మంది రైతులకు సంబంధించి నేటికి 1,500 మంది రైతులకు చెందిన భూ వివరాలను నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో రికార్డుల నమోదుతో పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతులు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు తాకట్టు పెట్టి రుణాలు పొందే అవకాశం ఉండదు. భూముల క్రయ, విక్రయాల సమయంలో తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలు ఉండదు.

బకాయిల వసూళ్లకు ప్రణాళిక..

రైతుల భూవివరాల ఆన్‌లైన్ నమోదుతో బకాయిల వసూళ్లు కూడా త్వరగా అయ్యే అవకాశం ఉంటుందని పీఏసీఎస్‌అధికారుల అభిప్రాయం. యాచారం పీఏసీఎస్‌లో 2,032 మంది రైతులు దాదాపు రూ.40 కోట్ల పైగా దీర్ఘకాలిక రుణాలు పొందారు. 2021–22కు సంబంధించి 40 శాతం రుణబకాయిలు వసూల్ కాలేదు. ఐదేళ్ల కింద దీర్ఘకాలికం కింద రుణాలు పొందిన రైతులు పీఏసీఎస్ అధికారులకు సమాచారం లేకుండానే వ్యవసాయ భూముల విక్రయాలు జరిపారు. రుణ వసూళ్లకు వెళ్తే భూములు అమ్మేశాం, త్వరలో డబ్బులు ఇస్తామని రైతులు చెప్పడంతో బిత్తరపోవడం అధికారుల వంతైంది. దీంతో పీఏసీఎస్ అధికారులు ఆన్‌లైన్ రికార్డుల ద్వారా భూముల క్రయవిక్రయాలు జరపకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను స్థానిక తహసీల్దార్ (రిజిస్ట్రేషన్) కార్యాలయంలో అందజేయనున్నారు. 2022–23 ఏడాదికి సంబంధించి రుణ వాయిదాలు చెల్లించని రైతుల భూముల జప్తునకు రంగం సిద్ధం చేస్తున్నారు. మార్చి–2024లోపు రుణ బకాయిలు చెల్లించాలని పక్షం రోజులుగా పీఏసీఎస్ అధికారులు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారు. చెల్లించని పక్షంలో వారి భూములను వేలం వేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.

యాచారం పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతుల వివరాలు

మొత్తం సభ్యులు:	7,900
మొత్తం రుణాలు అందజేత:	రూ.80 కోట్లు
దీర్ఘకాలిక రుణాలు పొందినవారు:	2,032
స్వల్పకాలిక రుణ గ్రహీతలు:	1,100
వ్యక్తిగత రుణాలు పొందిన రైతులు:	150
బంగారంపై రుణాలు పొందినవారు:	336

బకాయిలు చెల్లించాలి



యాచారం పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పొందిన ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పీఏసీఎస్‌లో రుణాలు పొందిన ఖాతా నంబరు, భూ రికార్డుల వివరాలను రైతు ఆధార్ కార్డు నంబరుతో అనుసంధానం చేస్తున్నాం. రైతుల ఆన్‌లైన్ వివరాలతో కూడిన పత్రాలను తహసీల్దార్ (రిజిస్ట్రేషన్) కార్యాలయంలో అందజేస్తాం. మార్చి–2024 లోపు బకాయిలు చెల్లించని పక్షంలో వారి భూములను వేలంపాటలో విక్రయిస్తాం. రైతులు బకాయిలు చెల్లించి సహకరించాలి.

– నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ, యాచారం

కాంగ్రెస్ పార్టీదే అధికారం



ఇబ్రహీంపట్నం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి, చిత్రంలో నిరంజన్‌రెడ్డి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామం నుంచి పలు పార్టీలకు చెందిన 100 మంది నాయకులు మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొహెడ సమీపంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో వారు హస్తం కండువా కప్పుకున్నారు. మల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఫార్మాసిటీని రద్దుచేయిస్తానని అన్నారు. టీఎస్ఐఐసీ తీసుకున్న భూములను రైతులకే తిరిగి ఇప్పిస్తానని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి 11వ వార్డు కౌన్సిలర్ భాగ్యమ్మ మంగళవారం మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, గుండ లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచాల మండలం నుంచి..

మంచాల: మంచాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు మంగళవారం కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో వైఎస్సార్‌టీపీ నాయకులు జంగయ్యగౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, నాయకులు యాదగిరి, రామారావు, జంగయ్య, శ్రీకాంత్, భాస్కర్, బీజేపీకి చెందిన యశమోని శేఖర్, రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బీరయ్య, నర్సింహారెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు. నాయకులు హన్మంత్‌రెడ్డి, పండరీనాథ్ గౌడ్, రాములు, మాసయ్యగౌడ్, రాజు, సురేష్, కుమార్, నర్సింహ, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మహిళలు

మల్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని క్యాంపు కార్యాలయంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని మంగళవారం ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మల్‌రెడ్డికి నిరంజన్‌రెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మల్‌రెడ్డి మాట్లాడుతూ.. టికెట్ కోసం పోటీపడ్డ నాయకులంతా నేడు ఒకేతాటిపైకి రావడం జరిగిందన్నారు. నవంబర్ 9వ తేదీన నామినేషన్ వేస్తానన్నారు. మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. మొదట ఇబ్రహీంపట్నం నుంచి పోటీచేయాలని అనుకున్నానని.. అయితే పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు మల్‌రెడ్డి రంగారెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా మల్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ లక్ష్మీపతిగౌడ్, ఈసీ శేఖర్‌గౌడ్, జెడ్పీటీసీ మహిపాల్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావొద్దు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికలప్పుడు వచ్చి ప్రలోభాలకు గురిచేసే నాయకులను నమ్మవద్దని.. నిరంతరం ప్రజల కోసం పనిచేసే వారికి ఓటు వేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగుళూర్ సమీపంలోని ప్రమీద గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ నాయకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కేవలం ఎన్నికలప్పుడు వచ్చే నాయకులను నమ్మవద్దని.. అందరి సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: హెవెన్స్ కాలనీవాసులతో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచిరెడ్డికే మా మద్దతు..

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికే మా మద్దతు అంటూ పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 5వ వార్డులోని సదాశివ హెవెన్స్ కాలనీవాసులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ విద్యావతి, పట్టణ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు రేణుక, నాయకులు సత్యనారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతోనే కల్వకుర్తి అభివృద్ధి

తలకొండపల్లి: కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ అభ్యర్థి తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి, మెదక్‌పల్లి, రాంపూర్ తదితర గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్నానని.. అనేక పర్యాయాలు ఓడిపోయినా ప్రజాసమస్యలపై పోరాటం కొనసాగిస్తున్నానన్నారు.కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండాలో వివిధ పార్టీలకు చెందిన 50 మంది నాయకులు మంగళవారం కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి సమక్షంలో ఆ పార్టీలో చేరారు.గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి శంకర్‌నాయక్, జిల్లా కార్యదర్శి సాయిలాల్‌నాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు వీరయ్య, డాక్టర్ రమేశ్, రాందాస్, లక్ష్మణ్, రాజు, శ్రీకాంత్ ఉన్నారు.



ఆచారికి స్వాగతం పలుకుతున్న మహిళలు

బీజేపీ కార్యాలయం ప్రారంభం..

కడ్తాల మండల పరిధిలోని మైసిగండిలో మంగళవారం బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాందాస్‌నాయక్ ప్రారంభించారు. సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుద్యానాయక్, రెడ్యానాయక్, వీరయ్య, మోహన్‌రెడ్డి, శంకర్‌నాయక్, సాయిలాల్‌నాయక్, చందన్‌నాయక్, దశరథ్, చత్రు, సాయి, విజయ్, తరుణ్, ధన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

యాదవుల అభివృద్ధికి ప్రాధాన్యత

- మేకలు, గొర్రెల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ బాలరాజుయాదవ్

ఆమనగల్లు: యాదవుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మేకలు, గొర్రెల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ బాలరాజుయాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం కల్వకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా నియోజకవర్గ గొర్లకాపరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ బాలరాజుయాదవ్, ఎమ్మెల్సీ మల్లేశం, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు క్యామ మల్లేశ్, శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఎమ్మెల్సీగా రెండుసార్లు అవకాశం ఇచ్చినా.. బీఆర్ఎస్ పార్టీని కాదని కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డిని ఓడించాలని ఎమ్మెల్సీ మల్లేశం కోరారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గొల్లకురుమలను సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా ఆదుకున్నారని.. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గిరియాదవ్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, కడ్తాల ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



బాలరాజుయాదవ్, మల్లేశం, జైపాల్‌యాదవ్‌ను సత్కరిస్తున్న నాయకులు

బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం: సీపీఎం

మంచాల: మంచాల మండల పరిధిలోని చీదేడ్‌లో మంగళవారం సీపీఐ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని తీర్మాణం చేశారు. ఆ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ యాదిరెడ్డి, నాయకులు నర్సింహ,శ్రీశైలం, నీలమ్మ, రాజునాయక్, కృష్ణ,గాలయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాదర్‌గుల్‌లో భూతగాదా..

ఇరువర్గాలపై కేసులు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: నాదర్‌గుల్‌లో భూతగాదాల కారణంగా జరిగిన ఘర్షణకు కారకులపై ఆదిబట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. మంగళవారం నాదర్‌గుల్‌లోని ఓ వివాదస్పద భూమి వద్ద పంటను కోసుకోవడానికి వెళ్లిన కోమ్రేష్‌పై షేక్ మహమ్మద్ మనుషులు (బౌన్సర్లు) దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు కోమ్రేష్‌తో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేశారు. పోలీసులు కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ అండగా నిలిచారు. రైతులకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి వారిని సముదాయించి విచారణ చేస్తానని హామీ ఇచ్చారు.

మహిళతో అసభ్య ప్రవర్తన కేసులో..

నిందితుడికి రెండేళ్ల జైలు

ఇబ్రహీపంట్నం: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండు సంవత్సరాల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. సీఐ గోవింద్‌రెడ్డి తెలిపిన వివరాలు... ఉప్పరిగూడకి చెందిన వెంకటేశ్ అదే గ్రామానికి చెందిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన 2017లో జరగగా పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయస్థానం వివిధ సెక్షన్ల కింద నిందితుడు వెంకటేశ్‌కు రెండేళ్ల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. అదేవిధంగా ఈ కేసును జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఖానాపూర్‌కి చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కసిరెడ్డి సూచించారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం సాధ్యమని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి మాధవిరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి, సంకటోనిపల్లిలో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే అధికారం

కడ్తాల్: అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతోందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డిని గెలిపించాలని కోరారు. యువజన కాంగ్రెస్ నాయకులు నరేశ్‌నాయక్, చిన్నా, శ్రీను, శివనాయక్, మహేశ్‌గౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

మాడ్గుల: నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇస్తే అందుబాటులో ఉండి పనిచేస్తానని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. మాడ్గుల మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలజీసింగ్, రాష్ట్ర నాయకుడు రాఘవేందర్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం మండలం పరిధిలోని అందుగుల గ్రామనికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అందుగుల సర్పంచ్ జయలక్ష్మి, వార్డు సభ్యులు రమేష్, అలివేలు, చిన్నయ్య గౌడ్, వెంకటయ్య, మహేష్ గౌడ్, నరేష్ గౌడ్, జంగయ్య గౌడ్, నిరంజన్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

తలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తక్షణమే ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి కసిరెడ్డి మాధవిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో.. నారాయణ్‌రెడ్డిని గెలుపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. కసిరెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. అధికారంలో వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శంకర్, కుమార్, విజేశ్వర్, పెంటారెడ్డి, జంగమ్మ, బుచ్చయ్య, వెంకట్‌రెడ్డి, జహంగీర్, శ్రీనివాస్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

చౌటుప్పల్: దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించి చౌటుప్పల్ సీఐ ఎస్.దేవేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా తెనాలి పట్టణ కేంద్రంలోని పాండురంగపేటకు చెందిన పాతులోతు అశోక్‌నాయక్, అతని మామ ముడావత్ గోపినాయక్ వ్యక్తిగత పని మీద ఇటీవల హైదరాబాద్‌కు వచ్చారు. పని ముగిసిన అనంతరం వారు సోమవారం రాత్రి తమ టాటా ఇండిగో కారులో తిరుగు పయనమయ్యారు. ఆ క్రమంలో అప్పటికే అలసటకు గురైన వారిద్దరూ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామం వద్ద అర్ధరాత్రి కారు ఆపుకొని అందులోనే నిద్రపోయారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో నివాసం ఉండే రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం వెల్దండ గ్రామానికి చెందిన ఉబాది అరవింద్, చంపాపేట్‌లో నివాసం ఉండే నల్లగొండ జిల్లాలోని పీఏపల్లి మండలం పెండ్లిపాకల గ్రామానికి చెందిన బీమనబోయిన శివ, సరూర్‌నగర్‌లోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన లొడిగె శివ ఆటోలో లక్కారం గ్రామం వద్దకు వచ్చారు. రోడ్డు వెంట ఆగి ఉన్న కారులో నిద్రిస్తున్న గోపినాయక్ వద్దకు వెళ్లి చేతులతో పట్టుకున్నారు. చంపుతామని బెదిరించి ఇద్దరి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, చేతి ఉంగరం, నగదు, ఏటీఎం కార్డును లాక్కొని పరారయ్యారు. వెంబడించినా ఫలితం లేకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ దేవేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలించి నిందితులను 24గంటల లోపు అరెస్టు చేసి సొత్తు రికవరీ చేశారు. ఏ–1గా ఉన్న అరవింద్‌పై ఏడు దారి దోపిడీ కేసులు ఉన్నాయని, నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

మాలెపల్లిలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మాలెపల్లిలో మంగళవారం బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి ప్రజలకు అందుబాటులో ఉండే జైపాల్‌యాదవ్‌ను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, పోలెపల్లి ఎంపీటీసీ కుమార్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, రాంనుంతల సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వండి: ఎక్సైజ్ సీఐ

కడ్తాల్: ఎక్కడైనా అక్రమంగా మద్యం, గంజాయి, మత్తుపదార్థాలు, స్పటిక లాంటి మత్తు పదార్థలను నిల్వచేసినట్లు, క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులకుగానీ, టోల్ ఫ్రీ నంబర్ 18004252523 గానీ సమాచారం అందించాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ ప్రజలను కోరారు. మంగళవారం మండల పరిధిలోని మైసిగండితో పాటు, పలు గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో. ఆమనగ్లు పట్టణంలోని పలు కిరాణ షాపులు, గోడౌన్లు, పలు నివాసగృహాల్లో తనిఖీలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. అక్రమ మద్యంపై టోల్ ఫ్రీ నంబర్‌కు గానీ ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం 8712658742 నంబర్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు.